క్లుప్తంగా

రేపటి నుంచి పదో తరగతి పరీక్షలు

అల్లవరం: ఈ నెల 17 నుంచి 31వ తేదీ వరకూ జరగనున్న పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈఓ కిరణ్‌బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు 587 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరికి అల్లవరంలో రెండు, దేవగుప్తం, కొమరగిరిపట్నం ఉన్నత పాఠశాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒక గంట ముందుగానే కేంద్రానికి రావాలని సూచించారు. పరీక్షా కేంద్రాలు వద్ద తాగునీరు, వైద్య శిబిరాలు ఏర్పాటు చేశామని ఎంఈఓ తెలిపారు. విద్యార్థులు ఏలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షలు బాగా రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు.

వైద్య పోస్టులు భర్తీ చేయాలి

అమలాపురం టౌన్: పెద్దాసుపత్రి అయిన అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో పలు ముఖ్య విభాగాలకు వైద్యులకు లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని పట్టణానికి చెందిన నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శ్రీనివాసరావు శనివారం అమలాపురంలో ఓ ప్రకటన విడుదల చేశారు. ఆస్పత్రిలో అతి ముఖ్యమైన ఎండీ జనలర్ మెడిసన్ వైద్య పోస్టు ఖాళీగా ఉందని, అలాగే మరో అతి ముఖ్యమైన గైనిక్ విభాగానికి సంబంధించి రెగ్యులర్ డాక్టర్లు లేరని పేర్కొన్నారు. వారానికి మూడు రోజులు గైనిక్ డాక్టర్లు వచ్చి రోగులను చూస్తున్నారని తెలిపారు. కిమ్స్ వైద్య కళాశాల పీజీ విద్యార్థులతో వైద్యం చేయిస్తున్నారని పేర్కొన్నారు. పేదలకు సంబంధించిన ప్రభుత్వ వైద్యం పూర్తి స్థాయిలో అందక అవస్థలు పడుతున్న ప్రజలకు తక్షణమే ఆస్పత్రిలో వైద్య పోస్టులను అన్నీ భర్తీ చేయాలని ఆయన శ్రీనివాసరావు సూచించారు.

ఘనంగా శ్రీపుష్పయాగం

యానాం: యానాంలో కొలువైన భూ సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి సోమవారం వరకు నిర్వహించే శ్రీపుష్పయాగం పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బెజవాడ బాపనయ్య మనుమలు ఉత్సవదారులుగా నిర్వహించే శ్రీపుష్పయాగంలో భాగంగా మొదటిరోజు స్వామివారు విశేష అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్వామివారి కల్యాణోత్సవ కమిటీ, యానాం పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

మిడ్డే మీల్స్‌లో ప్రతి రోజూ గుడ్డు

యానాం: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో ఇకపై వారంలో ప్రతిరోజూ గుడ్డు వేయడానికి నిర్ణయించినట్టు సీఎం రంగసామి ప్రకటించారు. శనివారం ఆయన మాట్లాడుతూ అన్ని రేషన్‌కార్డులకు ఇకపై ఉచిత బియ్యంతో పాటు రెండు కేజీల గోధుమలు సైతం పంపిణీ చేస్తున్నట్లు ప్రకటించారు.

పాసిక్‌కు స్పెషల్ ఆఫీసర్ నియామకం

యానాం: వ్యవసాయశాఖ అనుబంధ ప్రభుత్వ రంగ సంస్థ పుదుచ్చేరి ఆగ్రో సర్వీస్ అండ్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ (పాసిక్)కు ప్రత్యేక అధికారిని నియమించాలని శనివారం ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాన కార్యదర్శి శరత్ చౌహాన్ అధ్యక్షతన పాసిక్ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాసిక్ వ్యవహారాలను చూసేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని నిర్ణయించినట్టు తెలిపారు. వ్యవసాయశాఖ అడిషనల్ డైరెక్టర్ జయశంకర్ పాసిక్ సంబంధించి బాధ్యతలన్నీ చూస్తారని తెలిపారు. సంబంధిత అథారిటీలు తక్షణం సంబంధిత డాక్యుమెంట్లు, ఫైల్స్, రికార్డులను సిద్ధం చేయాలన్నారు.

నూతన లిక్కర్ పాలసీ అమలు చేయాలి

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా నూతన లిక్కర్ పాలసీని అమలు చేయాలని ఎంపీ వైథిలింగం కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల అవసరం లేకున్నా కొత్తగా 6 లిక్కర్ ఫ్యాక్టరీలకు అనుమతిచ్చారన్నారు. లిక్కర్ అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే రెవెన్యూ తదితరమైన వాటి గురించి సరైన విధానం లేదని విమర్శించారు. లిక్కర్ షాపులు, ఫ్యాక్టరీల అనుమతుల ద్వారా ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయంటే దానికి కాంగ్రెస్ మద్దతు నిస్తుందన్నారు. మాతృభాషకు ప్రాధాన్యత నివ్వకుండా త్రిభాషా విధానానికి సీఎం రంగసామి మద్దతునిస్తూ ఏవిధంగా ప్రపంచ తమిళ కాన్ఫరెన్స్‌ను నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. హోంమంత్రి నమశ్శివాయం సైతం త్రిభాషా విధానానికి మద్దతునిస్తున్నారని విమర్శించారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం ప్రజల ఆదరణ కోల్పోయిందని తక్షణం అసెంబ్లీ ఎన్నికలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో లౌకిక పార్టీలతో కాంగ్రెస్ పొత్తు పెట్టుకుంటుందన్నారు.

విద్యార్థులకు పరీక్షా కిట్ల అందజేత

అల్లవరం: మల్లాడి హనుమంతరావు ఫౌండేషన్, హెల్పింగ్ హ్యాండ్స్ చారిటబుల్ ట్రస్టు అమలాపురం వారి ఆధ్వర్యంలో ఓడలరేవు ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పరీక్షా స్టేషనరిని అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మల్లాడి యామిని పద్మ ప్రియ, ట్రస్టు చైర్మన్ చిప్పల నరేష్‌కుమార్, హెచ్‌ఎం కేఎస్ఆర్ మూర్తి, రవికుమార్, చంద్రరావు, కోలా నరసింహస్వామి, కొప్పాడి నాగరాజు పాల్గొన్నారు.

నిధులున్నా.. నిర్మాణాల్లేవే..

- ఈ వేసవిలోనూ తాగునీటి కష్టాలేనా?
- పూర్తికాని ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణాలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



పిల్లర్ల స్థాయిలో ఆగిపోయిన మొల్లేటిగరువు ట్యాంకు నిర్మాణం



శిరగట్లపల్లిలో నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని ట్యాంకు

అల్లవరం: రెండు దశాబ్దాలుగా శివారు ప్రాంత ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు. ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించాలన్నా ప్రజా ప్రతినిధుల సంకల్పానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. ఓఎన్‌జీసీ కాకినాడ అసెట్ వారి ఆర్థిక సౌజన్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్), జల జీవన్ మిషన్ నిధులతో శివారు గ్రామాల్లో ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి మంజూరు చేసే, ఆ నిధులను వినియోగించడంలో అధికారులు విఫలమయ్యారు. ఈ ఏడాది మార్చి 31వ తేదీతో గడువు ముగుస్తున్నా నేటికి నిర్మాణాలు పూర్తి కాలేదు. అధికారుల నిర్లక్ష్యంగా ఉండడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడాల్సి వస్తోంది.

నిధులు మంజూరైనా..

జల జీవన్ మిషన్ పథకంలో భాగంగా ఇంటింటికీ శుద్ధమైన తాగునీరు అందించాలన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వ లక్ష్యానికి సీఎస్ఆర్ నిధులతో శివారు ప్రాంతాల్లో ఓహెచ్ఆర్ ట్యాంకుల నిర్మాణానికి మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎంపీ చింతా అనురాధ కృషితో ఒక్కో ట్యాంక్ నిర్మాణానికి రూ.35 లక్షల చొప్పున సీఎస్ఆర్ నిధులను మంజూరు చేయించారు. అల్లవరం మండలంలోకి కోడూరుపాడులోని మాకేవారిపేట, ఎంట్రుకోనలో ఉల్లింగివారిపేట, కొమరగిరిపట్నంలో కడదారి, ఎన్.రామేశ్వరం, తూర్పులంకలో ఎస్సీ కాలనీ, మొగళ్లమూరులో శిరగట్లపల్లి, అల్లవరంలో మొల్లేటి గరువులో ట్యాంక్ నిర్మాణానికి గత సార్వత్రిక ఎన్నికలకు ముందు పనులు ప్రారంభమయ్యాయి.



నిర్మాణ దశలో ఉన్న ఎంట్రుకోన ట్యాంకు

నిర్మాణ పనులు ప్రారంభమై 11 నెలలు కావస్తున్నా నేటికీ పూర్తికాలేదు. అల్లవరంలోని మొల్లేటి గరువులోని ఓహెచ్ఆర్ ట్యాంక్ పిల్లరూ దశలో అసంపూర్తిగా ఉంది. ఏడాది అయినా పనుల్లో ఎలాంటి పురగోతి లేదు. ఎంట్రుకోన మొల్లేటివారిపాలెంలో ఓహెచ్ఆర్ ట్యాంక్ నిర్మాణ దశలో ఉంది. కొమరగిరిపట్నంలోని కడదారి, ఎన్.రామేశ్వరంలోని ట్యాంకుల నిర్మాణం పూర్తయినా పైపులైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. మాకేవారిపేట, శిరగట్లపల్లి గ్రామాల్లోని ఓహెచ్ఆర్ ట్యాంకు నుంచి ఇటీవల తాగునీరు ట్రయిల్ నిర్వహించారు. ఇప్పటికైనా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి అసంతృప్తికంగా ఉన్న నిర్మాణాలపై శ్రద్ధ చూపి త్వరితగతిన నిర్మాణాలను పూర్తి చేసి శివారు ప్రాంత ప్రజలు పూర్తి స్థాయిలో తాగునీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

త్వరలో నిర్మాణాలు పూర్తి చేస్తాం



సీఎస్ఆర్ నిధులతో చేపట్టిన ఓహెచ్ఆర్ ట్యాంకులు పూర్తి చేశారు. కడదారి, ఎన్.రామేశ్వరం, తూర్పులంక, శిరిగట్లపల్లి, తుమ్మలపల్లి, గోడి గ్రామాల్లోని ట్యాంకుల నిర్మాణ పనులు పూర్తయ్యాయి, వాటికి ట్రయిల్ రన్ నిర్వహించారు. త్వరలో ప్రారంభోత్సవం నిర్వహించి తాగునీరు విడుదల చేస్తాం. జేజేఎం పథకంలో ఎంట్రుకోన నిర్మాణ దశలో ఉండగా మొల్లేటి గరువులోని ట్యాంకుల పనులు చేపట్టాల్సి ఉంది. త్వరలో వీటిని పూర్తి చేసి తాగునీటి ఇవ్వడానికి అన్ని విధాలు ప్రయత్నం చేస్తున్నాం.

– స్వామి, ఏఈ , ఆర్‌డబ్ల్యుఎస్, అల్లవరం

వైఎస్సార్ సీపీ నేత రూ.10 వేల సాయం



విశ్రాంతి తీసుకుంటున్న రాజుకు ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీనివాసరావు

అమలాపురం టౌన్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న పులుపకూర రాజుకు పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధార కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్ రూ.10 వేల సాయం అందించారు. స్థానిక మున్సిపల్ కాలనీకి చెందిన రాజు రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం క్షతగాత్రునిగా విశ్రాంతి తీసుకుంటున్న రాజు ఇంటికి శ్రీనివాసరావు, మాజీ కౌన్సిలర్ శ్రీదేవి దంపతులు శనివారం స్వయంగా వెళ్లి ఆర్థిక సాయం సమకూర్చారు.

గరిమెళ్ల సంస్మరణ సభ



సంస్మరణ సభలో గరిమెళ్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు

అమలాపురం టౌన్: ఇటీవల విష్ణు సాన్నిధ్యానికి చేరిన తిరుమల తిరుపతి దేవస్థానం ఆస్థాన గాయకులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభ స్థానిక భూపయ్య అగ్రహారంలోని సాయిబాబా మందిరంలో ఆర్ట్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జరిగింది. తొలుత దివంగత గరిమెళ్ల చిత్ర పటానికి ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆర్ట్ ఫ్యామిలీ అధ్యక్షురాలు తాతపూడి సౌమ్యలక్ష్మి మాట్లాడుతూ అన్నమయ్య సంకీర్తనలు ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి బాలకృష్ణ ప్రసాద్ తన జీవితాన్ని అంకితం చేశారని గుర్తు చేశారు. అనంతరం సంస్మరణ సభలో అన్నమయ్య కీర్తనలు పాడి బాలకృష్ణ ప్రసాద్‌కు సంగీత నివాళులర్పించారు. సంస్మరణ సభలో ఆర్ట్ ఫ్యామిలీ ప్రతినిధులు పేరి వాణి, ఆంధ్ర ఉషారాణి, పుత్సా కృష్ణ కామేశ్వర్, గంటి వాణి, కొత్తూరి బాలశ్రీపాద అన్నపూర్ణ, పేరి లీలావతి, మూల బాల, వరహాభట్ల లలిత, పి.సుశీల తదితరులు అన్నమయ్య కీర్తనలు ఆలపించారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలి

- జిల్లా ఇన్‌చార్జి అధికారి రవి సుభాష్
- ఘనంగా స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం



నాతవరంలో స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ప్రత్యేకాధికారి సుభాష్, జేసీ నిషాంతి తదితరులు

ముమ్మిడివరం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి పర్యావరణాన్ని కాపాడు కోవడంలో ప్రజలందరూ భాగస్వామ్యులు కావాలని జిల్లా ఇన్‌చార్జి అధికారి పి.రవిసుభాష్ పిలుపునిచ్చారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలో శనివారం ఆయన ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును పరిశీలించారు. అనంతరం స్వచ్ఛాంధ్ర -స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రతినెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. 2025 జనవరి నుంచి ప్రతి నెలా ఒక ఇతి వృత్తంతో స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.. మార్చిలో సింగిల్ యూస్డు ప్లాస్టిక్‌ను నిషేదిద్దాం- పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహిద్దాం అనే ఇతి వృత్తంతో స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్లాస్టిక్ వినియోగం కారణంగా జరిగే హానిని ప్రజలకు తెలియజేయడంలో అధికారులు ప్రజా ప్రతినిధులే కాకుండా పాత్రికేయులు, విద్యార్థులందరూ బాధ్యత వహించాలన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా పారిశుధ్య నిర్వహణకు అవసరమైన పరికరాలను సమకూర్చుకునేలా జిల్లా యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. జిల్లాలో 385 గ్రామ పంచాయతీలకు గాను 268 గ్రామ పంచాయతీలలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు నిర్మాణం పూర్తయిందని 117 గ్రామ పంచాయతీల్లో షెడ్ల నిర్మించాల్సి ఉందన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి మాట్లాడుతూ అనాతవరం గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలందరూ స్వచ్ఛతను పాటించాలని సూచించారు. అనంతరం రాష్ట్రం, దేశాన్ని ప్లాస్టిక్ నుంచి విముక్తి కల్పిద్దామంటూ నిర్వహించిన ర్యాలీలో జిల్లా ఇన్‌చార్జి అధికారి, జాయింట్ కలెక్టర్ పాల్గొన్నారు.



పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది, వర్తకులు

ఏరియా ఆస్పత్రిలో వైద్యుల శ్రమదానం

అమలాపురం టౌన్: అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది, ఆస్పత్రి వద్ద ఉన్న గణేష్ వర్తక సంఘం ప్రతినిధులు ఆస్పత్రి ఆవరణలో శనివారం శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివస్ ప్రతిజ్ఞ చేసి చీపర్లు పట్టి ఆస్పత్రి ప్రాంగణంలో పేరుకు పోయిన చెత్తను ఊడ్చారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకర రావు ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది ఈ శ్రమ దానంలో పాలు పంచుకున్నారు. గణేష్ వర్తక సంఘం అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త వలవల శివరావుతో పాటు ఆస్పత్రి వైద్యులు, నర్సులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి అనర్థం

ఉప్పలగుప్తం: ప్లాస్టిక్ వినియోగం ఆరోగ్యానికి అనర్థమని సర్పంచ్ యర్రంశెట్టి రామచంద్రరావు అన్నారు. మునిపల్లి గ్రామంలో పలు వీధుల్లో స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛ దీవస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పిస్తూ, దాని వినియోగాన్ని ఎంత వరకు వినియోగించాలో వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది బాషా, ఏడుకొండలు, వార్డుమెంబర్ దోనిపాటి మీరాసాహెచ్, జాజిమెగ్గల శ్రీరామ్, కోటిపల్లి సూర్యపండు, అప్పాడి శ్రీను, వాసంశెట్టి ఏసుకుమార్, యనమదల పండు, వాసంశెట్టి వెర్రియ్య పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు

అమలాపురం రూరల్: ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరనానికి ముప్పు వాటిల్లుతుందని జిల్లా పంచాయతీ అధికారిణి డి.శాంతాలక్ష్మి పేర్కొన్నారు. స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ కార్యక్రమంలో శనివారం కామనగరువు పంచాయతీ వద్ద సర్పంచ్ నక్కా అరుణకుమారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నిషేధంపై జరిగిన అవగాహన సదస్సులో డీపీవో మాట్లాడుతూ ప్లాస్టిక్ వల్ల క్యాన్సర్ వంటి భయంకర వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో విజయశ్రీ, సూపర్‌వేజర్ అన్నపూర్ణేశ్వరి, ఈవోపీఆర్డీ మంగాదేవి, ఏఈ చినబాబు, కార్యదర్శి ఆర్ఎస్ఎస్ సూరపరాజు, జేపీబీసీ అదినారాయణ, సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ, హెల్త్, పాల్గొన్నారు. పాలగుమ్మిలో స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్ ర్యాలీని సర్పంచ్ కుడుపూడి రామలక్షిమ్మ ఆధ్వర్యంలో జరిగింది. తాండవపల్లి, బండారులంక, చిందాడగరువు కార్యక్రమాలు జరిగాయి.

ఘనంగా కాన్షీరామ్ జయంతి



కాన్షీరామ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అమలాపురం టౌన్: బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని స్థానిక ఎర్ర వంతెన వద్ద ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత కాన్షీరామ్ చిత్ర పటానికి జిల్లా పార్టీ నాయకులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి పొలమూరి మోహన్ బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఇన్‌చార్జి కాశి భవాని, పార్టీ నాయకులు జిత్తుక సత్యనారాయణ, పెండెం శ్రీనివాస్, జేడీఎస్ రాజు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతి రావు, ఆర్టీసీ యూనియన్ నాయకుడు ఆర్,నారాయణరావు, బీసీ నాయకుడు కె.రాజు పాల్గొని కాన్షీరామ్‌కు నివాళులర్పించారు.

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెంచాలని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. శనివారం సాయంత్రం స్థానిక చిల్డ్రన్స్ ఆడిటోరియంలో ప్రభుత్వస్కూల్స్ టీచర్లు, విద్యావేత్తలు, రిటైర్డ్ విద్యాశాఖాధికారులు తదితరులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషనలైజేషన్ ప్రక్రియను చేపట్టాలని గత కొంతకాలంగా పుదుచ్చేరి ప్రభుత్వం విస్తృత స్థాయిలో కసరత్తు చేస్తుందన్నారు. తగ్గుతున్న అడ్మిషన్లను పెంచేలా చేయాలన్నారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలో సుమారు 200 మంది టీచర్లు, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఎ ఎడీపీసీ కమిడి ప్రభాకరరావు, రిటైర్డ్ డెలిగేట్ టు డీఎస్ఈ డేవిడ్ రాజు, గుత్తుల రామారావు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా యూనియన్ కార్యదర్శిగా ఖాజామొహిద్దీన్

తాళ్లరేవు: డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవా మిత్రల ఉమ్మడి జిల్లా యూనియన్ కార్యదర్శిగా తాళ్లరేవుకు చెందిన ఎండీ ఖాజామొహిద్దీన్ ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. ఇప్పటివరకు పని చేసిన మురళీ శ్రీనివాస్ రాజీనామాతో ఖాళీ ఏర్పడడంతో స్టేట్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు స్థానిక మిత్రలతో చర్చించి ప్రధాన కార్యదర్శిగా మొహిద్దీన్‌ను నియమించారు. పలువురు ఉద్యసేవా మిత్రలు అభినందించారు. తనపై నమ్మకంతో ఉమ్మడి జిల్లాలో తనకు ఈ పదవి అప్పగించిన యూనియన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉగాది పురస్కారానికి నాని ఎంపిక

తాళ్లరేవు: గ్రామ పంచాయతీ శ్రీరంగనాయకపురం గ్రామానికి చెందిన వాస్తు జ్యోతిష్య నిపుణుడు వెదురు పావులూరి నాని 2025 ఉగాది పురస్కారానికి ఎంపిక య్యారు. తెలుగు బుక్‌ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ సంస్థ ఆస్ట్రాలజీ విభాగంలో తనను ఎంపికచేశారని, ఈ నెల 23వ తేదీన హైదారాబాద్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును అందుకోనున్నట్టు నాని ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన

అమలాపురం రూరల్: వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రజల్లో చైతన్యం వచ్చినప్పుడే చట్టం లక్ష్యం నెరవేరుతుందని జిల్లా పౌర సరఫరాల అధికారి అడపా ఉదయ భాస్కర్ తెలిపారు. శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లో వినియోగదారుల దినోత్సవం స్టాల్స్ ప్రదర్శన, గ్యాస్ వినియోగంపై అవగాహన ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వినియోగదారుల హక్కు కోసం చైతన్యం చేస్తున్న కోనసీమ కోకో ఫీడ్ చైర్మన్ అరిగెల బాలరామమూర్తితోపాటు పలువురిని డీఎస్ఓ ఉదయ భాస్కర్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ బాల సరస్వతి, తూనికలు కొలతలు కంట్రోలర్ రాజేష్, జిల్లా వ్యవసాయ అధికారి బోసు బాబు సత్కరించారు.

కోకోఫెడ్ జిల్లా కోర్డినేటర్ సత్యనారాయణకు సత్కారం

అమలాపురం రూరల్: ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో కవిరత్న డాక్టర్ బీవీవీ సత్యనారాయణను సత్కరించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం కోనసీమ కన్స్యూమర్ ఫెడరేషన్ జిల్లా కోఆర్డినేటర్‌గా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలలో అవగాహన కల్పించి చైతన్యం తీసుకు వస్తున్న సత్యనారాయణను జిల్లా సివిల్ సప్లై అధికారి అడపా ఉదయభాస్కర్, జిల్లా కన్స్యూమర్ అసిస్టెంట్ కంట్రోలర్ రమేష్, జిల్లా సివిల్ సప్లై మేనేజర్ సత్యవేణి,జిల్లా ఉన్నతాధికారులు, కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామ్మూర్తి, కార్యదర్శి ఆదిత్య కిరణ్,శ్రీనివాస్, అభిరామ్‌లు సత్కరించారు.



బాలరామమూర్తిని సత్కరిస్తున్న డీఎస్ఓ ఉదయ భాస్కర్

నరసాపురం ఎమ్మెల్యే నాయకర్ క్షమాపణ చెప్పాలి

తాళ్లరేవు: మహాదాత, విద్యాప్రదాత మల్లాడి సత్యలింగ నాయకర్‌ను జనసేన ఆవిర్భావ సభలో మత్స్యకారుడని వ్యాఖ్యానించి అవమానించిన నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అగ్నికుల క్షత్రియ జాతికి క్షమాపణ చెప్పాలని అగ్నికుల క్షత్రియ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శనివారం కోరంగిలో సత్యలింగ నాయకర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు ఓలేటి సూర్యప్రకాశరావు, పొన్నాడ జగన్నాథం, దండుప్రోలు శ్రీను, కొల్లు గౌతమ్, జైరామ్, చెక్కా అజయ్‌వర్మ, అంగాని భాస్కరవర్మ, ఓలేటి సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓడలరేవును ఓఎన్‌జీసీ దత్తత తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ నాయకుడు వెంకన్నాయుడు డిమాండ్



దీక్షా శిబిరంలో నిరసనకారులకు సంఘీభావం తెలుపుతున్న వెంకన్నాయుడు

అల్లవరం: ఓడలరేవులో చమురు కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓఎన్‌జీసీ ఆ గ్రామాన్ని దత్తత తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు వంటిద్దు వెంకన్నాయుడు డిమాండ్ చేశారు. ఓఎన్‌జీసీ టెర్మినల్ ప్లాంట్ వద్ద 15 రోజులుగా నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓఎన్‌జీసీ ఓడలరేవు నుంచి లక్షల కోట్ల రుపాయలు విలువ చేసే నిక్షేపాలను తరలించుకునిపోతూ గ్రామాన్ని అభివృద్ధిని విస్మరించిందన్నారు. కనీసం గ్రీన్ బెల్ట్ ఏర్పాటు చేయలేదని, తద్వారా తీరం పొడువునా కోతకు గురైతుందన్నారు. ప్లాంట్ నిర్మాణంతో ముంపు నీరు దిగే దారి లేక పంటపొలాలు, కొబ్బరి, సరుగుడు, జీడి మామిడి తోటలు మృత్యువాత పడుతున్నాయని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ధ్వజమెత్తారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా అన్యాయం చేస్తుందన్నారు. ఓడలరేవులో సకల సదుపాయాతో ఆస్పత్రి, సముద్రం కోతకు గురి కాకుండా తీర ప్రాంతాన్ని రిటైనింగ్ వాల్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వెంకన్నాయుడు డిమాండ్ చేశారు. ఓఎన్‌జీసీ స్పందించి గ్రామ సమస్యలపై దృష్టి సారించాలన్నారు. నిర్లక్ష్యానికి గురి చేస్తే న్యాయపరంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నిరసనకారులు పాల్గొన్నారు.

ఆదాయ పరిమితి రూ.8 లక్షలకు పెంపు

యానాం: నియోజకవర్గంలో యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ రీజియన్‌లలో ఆదిద్రావిడులు, ఎస్సీ, ఎస్టీలకు సంక్షేమ పథకాలు అమలు చేయడానికి వీలుగా ప్రస్తుత ఆదాయ పరిమితిని రూ.8లక్షలకు పెంచుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆదిద్రావిడియన్ అండ్ ట్రైబల్ వెల్ఫేర్ శాఖ నిర్ణయం తీసుకుంది. పుదుచ్చేరి వ్యాప్తంగా వ్యక్తిగత ఆదాయం రూ.2,87,354 నుంచి రూ.3,02,680కు పెరిగిందని, వ్యక్తిగత ఆదాయం సైతం రూ.15 వేలు పెరిగిందని నివేదికలు తెలిపాయన్నారు. ఈ నేపథ్యంలో పలువురు ఎమ్మెల్యేల వినతుల మేరకు ఆదిద్రావిడ శాఖ ద్వారా సంక్షేమ పథకాలు పొందడానికి రూ.8లక్షలు వరకు ఆదాయ పెంపుదలను నిర్ణయించినట్టు తెలిపారు. ఈ ఆదాయ పెంపు పరిమితి 8 సంక్షేమ పథకాలకు ఉచిత గృహ నిర్మాణానికి పట్టా, వివాహ సహాయం, గర్భిణులకు సాయం, దీర్ఘకాలిక వ్యాధులకు సహాయం, అగ్ని ప్రమాదంలో మృతి, ఉచిత దుస్తుల పథకాలకు ఈ పెంపు వర్తిస్తుందన్నారు. అయిదు ఎకరాల వ్యవసాయ భూమి, వెయ్యి చదరపు అడుగుల స్థలం ఉన్నవారికి ఈ పథకం వర్తించదన్నారు.